తెలుగు దినపత్రిక

# సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 36 | ఆదివారం01.11. 2026 | పేజీలు :4 | వెల: 2


## జ్ఞానేశ్ కుమార్ పై 'ప్రజా అభిశంసన'

- ప్రతిపక్షాల ప్రత్యామ్నాయ పార్లమెంట్!
- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన
- ఖర్గే నివాసంలో మాక్ పార్లమెంట్
- సభాపతిగా మాజీ స్పీకర్ మీరా
- తీర్మానం ప్రవేశపెట్టిన మల్లికార్జున ఖర్గే
- సోనియా, రాహుల్ సహా ప్రతిపక్ష అగ్రనేతల హాజరు



## నింగిలో మరో విజయం

- జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం
- ఇస్రోకు మోదీ ప్రశంసలు
- నిర్దేశిత కక్ష్యలోకి ఎన్వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహం
- శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ప్రధాని అభినందనలు



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ఎన్వీఎస్--03 నావిగేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు తెలిపింది.



## పారిశ్రామిక ప్రగతి.. నైపుణ్య యువతే కీలకం

### మంత్రి వివేక్ వెంకటస్వామి

దేశ ఆర్థిక ప్రగతికి పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు కీలకమని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. శనివారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశం ఏటా 8 శాతం స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధిస్తేనే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని పేర్కొన్నారు. ఇందుకు పరిశోధన, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణతో ఉద్యోగ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం దాదాపు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పించామని, వచ్చే ఏడాది మరో 54 కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, వారి అవసరాలకు అనుగుణంగా కోర్సులు, పాఠ్యప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సంస్థలు, పరిశ్రమల మధ్య నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతోందని, ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతకు సాంకేతిక నైపుణ్యాలతోపాటు స్థానిక భాష, పని సంస్కృతి, క్రమశిక్షణపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. విదేశీ ఉద్యోగాల ద్వారా లభించే ఆదాయం, స్వదేశానికి పంపే నగదు దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదపడతాయని వివరించారు.


## వనమా... సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానం!

- చెప్పిందే చేయడం.. చేసేదే చెప్పడం ఆయన నైజం
- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా సేవలు.. ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం
- ప్రజలతో మమేకం.. సమస్యల పరిష్కారానికి చొరవ చూపే నాయకత్వం
- నేడు వనమా జన్మదినం నేపథ్యంలో ప్రత్యేక కథనం...

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, (సూర్యోదయ వార్త)



రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, ప్రజలతో సన్నిహిత సంబంధాలు, సమస్యల పరిష్కారానికి చొరవ చూపే నాయకత్వం.. ఇవి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేకంగా ప్రస్తావించదగిన అంశాలు. ఆరు దశాబ్దాల పైగా రాజకీయ అనుభవం కలిగిన ఆయన నాలుగుసార్లు కొత్తగూడెం ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేశారు. వయస్సు పెరుగుతున్నా ప్రజా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో నిరంతరం అందుబాటులో ఉండటం ఆయన ప్రత్యేకతగా అభిమానులు పేర్కొంటారు.



**సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన**

నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్య తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపడం వనమా శైలిగా ఆయన అనుచరులు చెబుతుంటారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రజలతో కలిసిమెలిసి ఉండటం, శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజలతో సంబంధాలు కొనసాగించడం ఆయనకు నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ప్రజలు ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండే నాయకుడిగా అభిమానులు ఆయనను అభివర్ణిస్తుంటారు.

**సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయికి..**

పాత పాల్వంచలో జన్మించిన వనమా వెంకటేశ్వరరావు విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు రాజకీయ ప్రభావంతో ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు. 1964లో రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించి, అనంతరం వార్డు సభ్యుడిగా, సర్పంచ్‌గా, పలు సహకార సంస్థల బాధ్యతల్లో పనిచేశారు. 1971 నుంచి 1987 వరకు పాల్వంచ సర్పంచ్‌గా పనిచేసిన ఆయన హయాంలో 1984లో పాల్వంచ గ్రామపంచాయతీ ఉత్తమ గ్రామపంచాయతీగా గుర్తింపు పొందింది. 1989లో తొలిసారిగా కొత్తగూడెం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 1999, 2004, 2018 ఎన్నికల్లోనూ విజయం సాధించి నాలుగు సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.

**మంత్రి పదవితో జిల్లా అభివృద్ధికి కృషి**

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో వైద్య విధాన పరిషత్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. జిల్లా రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించారు. కొత్తగూడెం పట్టణంలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం 373 జీవో సాధనలో ఆయన కీలకంగా వ్యవహరించారని, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి కృషి చేశారని ఆయన అనుచరులు గుర్తుచేస్తుంటారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, న్యూ గొల్లగూడెంలో రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ల ఏర్పాటు, పాత కొత్తగూడెంలో నిరుపేదలకు గృహ సముదాయాల నిర్మాణం వంటి కార్యక్రమాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రస్తావించదగినవిగా నిలిచాయి.

**రాజకీయ ఒడిదుడుకులను అధిగమిస్తూ..**

రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న వనమా, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం టీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ మార్పు సమయంలో రాజకీయంగా పలు సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ తన అనుచరులు, కార్యకర్తలతో సంబంధాలను కొనసాగించేందుకు ప్రయత్నించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజలతో మమేకమయ్యే స్వభావం, నియోజకవర్గ అభివృద్ధిపై తనకున్న ఆసక్తితో వనమా వెంకటేశ్వరరావు కొత్తగూడెం రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజా సేవలో ఆయన అందించిన సేవలను అభిమానులు, శ్రేయోభిలాషులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు.



## ఎలక్ట్రానిక్స్ తయారీలో అగ్రగామిగా తెలంగాణ!

- తుక్కుగూడ ఈ-సిటీలో 'మివి' ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ ప్రారంభం
- రూ.200 కోట్లతో అత్యాధునిక మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు
- పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్నామన్న మంత్రి శ్రీధర్ బాబు
- చిప్ డిజైన్, సెమీకండక్టర్ల ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

## నగరంలో గ్రీన్ ట్యాంకర్లు

నవంబర్ 1న ప్రారంభం!

- సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



2



## హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం!

- రూ.24.76 కోట్లతో నకిలీ ట్రేడింగ్ దందా
- ప్రధాన నిందితుడు అలంరాజు ఇళ్లు, ఆఫీసుల్లో ఈడీ సోదాలు

3

- నకిలీ వెబ్‌సైట్‌తో పెట్టుబడిదారుల మోసం
- రూ.5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లా గుర్తింపు
- రూ.6.40 లక్షల నగదు సీజ్.. 11 ఖాతాల ఫ్రీజ్

## రేవంత్ 'క్రెడిట్ చోరీ'



### వేల కోట్ల భూములను కాపాడింది మేమే..

- సీఎం రేవంత్ రెడ్డి మాటలన్నీ అర్ధసత్యాలే
- గ్రేహౌండ్స్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు
- కోర్టు తీర్పుల కాపీలు బయటపెట్టిన హరీశ్ రావు

## చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా? వద్దా?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




హైదరాబాద్: దేశంలో 13కోట్ల మంది ఓట్లను తొలగించారని చెబుతున్న కాంగ్రెస్.. వాస్తవాలు ఎందుకు చెప్పడంలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి (ఖఅంఘ్లుఅ =వఒఒఎ) ధ్వజమెత్తారు. అందులో 2.8 కోట్ల మంది ఓటర్లు చనిపోయారు, వాటిని తొలగించాలా?వద్దా? అని ప్రశ్నించారు. దేశంలో 6.30 కోట్ల ఓటర్లు శాశ్వతంగా వలస వెళ్లారని, ఎక్కడున్నారో తెలియదని.. వాళ్లకు ఎన్నికల సంఘం నోటీసులిచ్చినా స్పందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే 6.30 కోట్ల ఓటర్ల ఆచూకీ కనిపెట్టి ఆధారాలు సమర్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన వాళ్లను, దొంగ ఓట్లను, ఆచూకీ లేని వలస ఓట్లను ఓటర్ జాబితాలో చేర్చాలని కాంగ్రెస్ ధర్నాలు చేస్తోందా? అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. పాతబస్తీ, మహేశ్వరం నియోజకవర్గాల్లో 2014కు ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ సహా విదేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వేల మంది ఓట్లున్నాయని, వాటిని తొలగించాలా? వద్దా? ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 2004లో చనిపోతే ఆయన ఓటు ఇంకా ఉందని, ఆ ఓటును తొలగించాలా వద్దా అని మరో కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఓడిపోతే ఈవీఎంలపైనా విష ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని దుయ్యబట్టారు.

## ఈవీఎంలపై డౌటుంటే.. అసెంబ్లీని రద్దు చేయండి!

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్
- బ్యాలెట్ ఎన్నికలకు మేం సిద్ధమని ప్రకటన

3



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...



## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి..

### వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ములుగు డిపిఓ -. కొండా వెంకయ్య..



**వాజేడు.ములుగు జిల్లా. అక్టోబర్ 31( సూర్యోదయ వార్త )**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీలో భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ వేదికపై సర్పంచ్. భరత్ కుమార్ మాట్లాడుతూ – దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమగ్రతకు బలమైన పునాది వేసిన మహనీయుడని కొనియాడారు. 1875 అక్టోబర్ 31న జన్మించిన ఆయన 1950 డిసెంబర్ 15న మరణించారని గుర్తుచేశారు. ఆయన జన్మదినాన్ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత, అంకితభావం, నాయకత్వ లక్షణాల్లో పటేల్ జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ వెంకయ్య ,సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్, ఉపర్పంచ్ రాజశ్రీ ,పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్,వేణు, కార్తీక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అందని ద్రాక్షతో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరసన..

### 19 రోజులకు చేరిన నిరవధిక సమ్మె..




**ములుగు. అక్టోబర్ 31- ( సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)**

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె 19 రోజులకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వానికి అందని ద్రాక్షల మారాయని పేరుకొంటూ ములుగు గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మూడో స్థానంలో నిలిపిన తమ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. చాలీచాలని జీతాలు. పని ఒత్తిడి ఉన్న 21 ఏళ్లుగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

## పోక్సో కేసులో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష..




**ములుగు. అక్టోబర్ 31 - ( సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి )**

ములుగు ప్రత్యేక పోక్సో సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సూర్య చంద్రకళ కీలక తీర్పు వెలవరించారు. ఏటూరు నాగారం పోలీస్ స్టేషన్ లో 2020 లో నమోదైన క్రైమ్ నంబర్ 41/2020 కేసులో నిందితుడు వావిలాల రాజు ను దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష రూ. 8 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కేసు దర్యాప్తులో సహకరించిన పోలీసులను అభినందించారు..

## బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి..

### తిమ్మంపేట క్రాస్ రోడ్ సమీపంలో ఈ ఘటన.



**మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 31 ( సూర్యోదయ వార్త )**

బైకు అదుపుతప్పి చెట్టు ను ఢీకొట్టి సంఘటనలో ఓ వ్యక్తి ములుగు జిల్లా మంగపేట మండలంలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు సమీపంలోనే మూలమలుపు వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు ప్రకారం. ఏటూరు నాగారం మండలం ఆకలి వారి ఘనపురానికి చెందిన మేరాజ్. ఏటూరు నాగారం నుంచి రాజపేట వైపు వెళ్తున్నాడు . ఈ క్రమంలో మంగపేట మండలంలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు సమీపంలో బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో మేరాజ్ బైకుతో సహా రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లో పడి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో మంగపేట ఎస్సై టీ విఆర్ సూరి సెకండ్ ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.


# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

- **సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రిన్సిపల్. డా. బి రేణుక.**

**ఏటూరు నాగారం. ములుగు జిల్లా అక్టోబర్ 31 ( సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)**

ములుగు జిల్లా ఏటూరు నాగారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నందు శనివారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని " జాతీయ ఐక్యత దినోత్సవం " నిర్వహించారు. ఈ కార్యక్రమం ను ప్రిన్సిపల్ డాక్టర్. బి. రేణుక – అధ్యాపక బృందం పటేల్ చిత్రపటానికి పూలమాల ధారణ చేసి నివాళులు అర్పించి సభను ప్రారంభించి మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ గొప్ప ధైర్యశాలి అని ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు.




అనంతరం చరిత్ర విభాగాధిపతి సిహెచ్ వెంకటయ్య మాట్లాడుతూ భారత స్వతంత్ర సమయంలో 560 కి పైగా ఉన్న సంస్థానాలను ఏకం చేయడంలో పటేల్ కృషి, ఆయన చూపిన తెగువ మరియు రాజనీతి అనన్య సామాన్యమని, విద్యార్థులందరూ వారు చూపిన మార్గంలో నడవాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, ఫాతిమా, సంపత్, భాస్కర్, రమేష్, శ్రీధర్, జీవ వేణి, భారతి, శ్రీకాంత్, శేఖర్, ప్రశాంతి, మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు...

# హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు

- **ప్రజల అవసరాలకు తక్షణమే స్పందించే నాయకురాలు మంత్రి సీతక్క..**
- **పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య..**

**మంగపేట. ములుగు జిల్లా అక్టోబర్ 31: ( సూర్యోదయ వార్త.)**

ములుగు జిల్లా మంగపేట మండలంలోని తిమ్మంపేట ఆవాస ప్రాంతమైన బీసీ కాలనీ కూడలి వద్ద నిర్మించనున్న శ్రీ హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.ఆలయ నిర్మాణానికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ, ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి,వాటి పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేసే ప్రజానాయకురాలు మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అని కొనియాడారు.బీసీ కాలనీలో



హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన వెంటనే మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు.ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించి ఆలయ నిర్మాణానికి సహకరించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.గుడి అయినా.. బడి అయినా ప్రజలకు అవసరమైన చోట నిర్మించాలన్నదే మంత్రి సీతక్క ఆలోచనా విధానమని గుమ్మడి సోమయ్య అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.ఈ ఆలయ నిర్మాణం పూర్తయితే బీసీ కాలనీ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు,గుండు నర్సయ్య, హనుమాన్ గుడి చైర్మన్ చిటమట రాజశేఖర్,తిమ్మంపేట గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర రాజు,గడ్డం పరమేష్,బొంబోతుల మురళి,యగ్గడి అర్జున్,బోడ రామచంద్రం,ముక్కెర రజనీకాంత్,మల్లెల కమలాకర్,రెడ్డి పవన్,వడ్ల సంతోష్,కోటి రామ్,తాటి నరసింహారావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు..

# నల్ల బ్యాడ్జీలతో మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు నిరసన..

- **317 జీవో అమలు. హెల్త్ కార్డు కారుణ్య నియామకాలు జేఎల్ ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్.**

**గోవిందరావుపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 31 ( సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)**

న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం జవహర్ నగర్ మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. 010 ద్వారా వేతనాల. టీజీటీలకు నోషనల్ ఇంక్రిమెంటు. 317



జీవో అమలు . హెల్త్ కార్డు. కారుణ్య నియామకాలు. జేఎల్ ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏపీ మెంబర్ రాజేంద్రప్రసాద్. ప్రిన్సిపల్ కృష్ణ. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి..

### బర్లగూడెం గ్రామపంచాయతీ

### సర్పంచ్- నల్లే బోయిన ఆదిలక్ష్మి..

**వెంకటాపురం. నూగూరు అక్టోబర్ 31 ( సూర్యోదయ వార్త )**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యత దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్. నల్లే బోయిన ఆదిలక్ష్మి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ – హైదరాబాద్ నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేసి ఉక్కు మనిషి గా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. దేశం కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది. గ్రామస్తులు పాల్గొన్నారు.




# బుచ్చంపేట అభివృద్ధికి మరో ముందడుగు

- **రూ.35 లక్షలతో 7 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం.**
- **మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మంగపేట మండలం అభివృద్ధి పథంలో ముందుకు**
- **పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య**

**మంగపేట, అక్టోబర్ 31:( సూర్యోదయ వార్త )**

ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామంలో ఎస్సీ ఎస్డీఎఫ్ నిధుల ద్వారా మంజూరైన రూ.35 లక్షల వ్యయంతో 7 సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి .డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో మంగపేట మండలం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి చర్యలు చేపడుతోందని తెలిపారు.గ్రామాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు,మురుగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గ్రామాల సమగ్ర అభివృద్ధి,ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,మండల నాయకులు చిన్నపెల్లి రాంబాబు,గడ్డం శ్రీహరి,గడ్డం పరమేష్,పన్నాల కొండల్ రెడ్డి,రాచకొండ సోమయ్య,ధర్మారపు యాకయ్య,నక్క యాకయ్య మరియు తదితరులు పాల్గొన్నారు...

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...





## ఐరన్ మ్యాన్ పోటీకి రాయినిగూడెం యువకుడు..

**ములుగు అక్టోబర్ 31 ( సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)**

ములుగు జిల్లా రాయిని గూడెం గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్ ప్రతిష్టాత్మకమైన ఐరన్ మ్యాన్ 70.3 టయర్లాన్ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. నవంబర్ 1న గోవాలో జరిగే ఈ పోటీలో 1.9 కిలోమీటర్ల ఈత. 90 మీటర్ల సైక్లింగ్ . 21.1 కిలోమీటర్ల పరుగు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు మర ద్రాన్లు ఆల్ట మర ద్రాన్లులో పాల్గొన్న నిఖిల్ . 42. 195 కిలోమీటర్ల పూర్తి మారథాన్ తో పాటు 80 కిలోమీటర్ల అల్ట్రా రన్ పూర్తి చేశారు.

## మంగపేటలో సహాయకుడి పదవీ విరమణ సన్మానం..





**మంగపేట. అక్టోబర్ 31( సూర్యోదయవార్త )**

మంగపేట మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సహాయకుడిగా పనిచేస్తున్న మహమ్మద్ ఇక్బాల్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం మంగపేట రైతు వేదికలో జరిగింది.మండల పరిషత్తు అభివృద్ధి అధికారి బి. భద్రు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇక్బాల్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి గోవిందరావుపేట మండల పరిషత్తు అభివృద్ధి అధికారి చిలువేరు వరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ పంచాయతీరాజ్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు బి. శ్రీనివాస్, జిల్లా పరిషత్తు పర్యవేక్షకుడు టి. రాజేందర్, సంఘ గౌరవ సలహాదారు నాగేశ్వరరావు, మండల పంచాయతీ అధికారి జి. మహేందర్, మండల పరిషత్తు పర్యవేక్షకుడు లక్ష్మణాచార్యులు, సిబ్బంది బిక్షపతి, శశికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, పత్రికా మిత్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భద్రు మాట్లాడుతూ మహమ్మద్ ఇక్బాల్ మంగపేటలో ఆరు నెలలు మాత్రమే పనిచేసినా మంచి పేరు తెచ్చుకున్నారని, మృదు స్వభావం, సహనం కలిగిన వ్యక్తి అని తెలిపారు. ఆయన పదవీ విరమణ పొందడం బాధాకరమన్నారు. హాజరైన వారందరూ ఆయన సేవలను కొనియాడారు...

## ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రిలో మోకాళ్లపై కూర్చుని నిరసన...

**సమాన పనికి. సమాన వేతనం, ఉద్యోగ భద్రత హెల్త్ కార్డులు. పై ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల డిమాండ్.**




**ఏటూరు నాగారం. అక్టోబర్ 31 ( సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)**

ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రిలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం. ఉద్యోగ భద్రత హెల్త్ కార్డులు. తదితరుల డిమాండ్ల సాధన కోసం 19వ రోజు సమ్మెలో భాగంగా శనివారం ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు ను పరిష్కరించాలని ఉద్యోగులు నినాదాలు చేశారు.

## జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతం..

శుక్రవారం అర్ధరాత్రి 11.51 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని షార్ (శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్) నుంచి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. దీని ద్వారా అత్యాధునిక నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-03 ని నింగిలోకి పంపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్రోను ప్రశంసిస్తూ.. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందికి అభినందనలు తెలిపారు.సామర్థ్యాలకు మరింత బలం చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్ రంగాలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు

# మంత్రి సీతక్క సహకారంతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట..

- తిమ్మంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..
- ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం.
- గుమ్మడి సోమయ్య,చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు



**మంగపేట, అక్టోబర్ 31:- ( సూర్యోదయ వార్త )**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద, బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను అమలు చేస్తోందని పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.. శనివారం మంగపేట మండలంలోని తిమ్మంపేట గ్రామంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రజల అవసరాలను గుర్తించి,పేద కుటుంబాలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని,ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వివరించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు,గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సహకారం,మార్గదర్శకత్వంలో ములుగు జిల్లా అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు,గడ్డం పరమేష్, బొంబోతుల మురళి, యగ్గడి అర్జున్, బోడ రామచంద్రం మరియు పాల్గొన్నారు...

# సీపీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్

**ఏడాది గడిచినా న్యాయం జరగలేదని ఆవేదన..**



**నిందితులను అరెస్టు చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం**

సీపీఎం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, పాతర్లపాడు మాజీ సర్పంచ్ అమరజీవి సామినేని రామారావు హత్య కేసులో ఏడాది గడిచినా అసలు నిందితులను గుర్తించి అరెస్టు చేయకపోవడంపై సీపీఎం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో అసలు నిందితులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని, కేసును పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అనుకూలంగా ఖమ్మం పోలీస్ కమిషనర్ వ్యవహరిస్తున్నారని విమర్శిస్తూ, సీపీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.శనివారం కారేపల్లి మండల కేంద్రంలో సామినేని రామారావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం కె. నరేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సామినేని రామారావు హత్య వెనుక కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నప్పటికీ, వారి వాంగ్మూలాలు, ఆధారాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ జరపడం లేదని విమర్శించారు. ఏడాది కాలంగా అసలు నిందితులను గుర్తించి అరెస్టు చేయడంలో పోలీసు శాఖ విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారా?

సామినేని రామారావు హత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలని సీపీఎం పార్టీ ఏడాది కాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తోందని నాగేశ్వరరావు తెలిపారు. అయితే అసలు నిందితులను తప్పించి, ఇతరులను నిందితులుగా చూపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ తీరుపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు!సామినేని రామారావు హత్య కేసులో అసలు నిందితులను గుర్తించి అరెస్టు చేసే వరకు సీపీఎం పార్టీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని కొండబోయిన నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రామారావు ఆశయాల సాధన కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు తలారి దేవప్రకాష్, ముక్క సీతారాములు, కొండబోయిన ఉమావతి, అన్నారు కృష్ణ, కర్కపల్లి రాయమల్లు, మేకల రమేష్, శ్రీరాములు, శంకర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు పిలుపునిచ్చారు.ఖమ్మం వరంగల్? నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం భాగ్యనగర్ తండా గ్రామంలో సర్పంచ్ బానోత్ హీరాలాల్‌తో కలిసి తోటకూరి రాంబాబు ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటు నమోదు ప్రాధాన్యతను వివరించారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ముందస్తుగా నమోదు చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఓటరు నమోదు గడువు సమీపిస్తున్నందున అర్హులైన పట్టభద్రులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రుల సమస్యలపై అవగాహన కలిగి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ప్రతి పట్టభద్రుడి ఓటు కీలకంపట్టభద్రులందరూ ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుగులోత్ భీముడు నాయక్, మండల పార్టీ సమన్వయకర్త వాంకుడోత్ గాంధీ, ఐఎన్‌టీయూసీ నాయకుడు లావు డ్యాఈర్య, ఓటరు నమోదు ప్రతినిధి గుగులోత్ ప్రసాద్, నాయకులు వాంకుడోత్ రాంబాబు, సమన్వయకర్త దారావత్ యేసు, దాస్య, బన్సీ, సామ్య తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఇలాంటి దాడులకు చోటు లేదు..

రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినిపై ఓ యువకుడు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. పాఠశాల తరగతి గదిలో ఉన్న పదో తరగతి బాలికపై చెట్లు నరికే రంపం యంత్రంతో ఓ యువకుడు దాడి చేశాడు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. విద్యార్థినిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బాలిక తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఆమెకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం పవన్ భరోసా ఇచ్చారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి అమానవీయ ఘటనలకు సమాజంలో చోటు లేదని హెచ్చరించారు. కాగా, శనివారం ఉదయం పాఠశాలలో ఉన్న విద్యార్థినిపై ఓ యువకుడు దాడికి తెగబడ్డాడు. ఉపాధ్యాయురాలు మ్యాథ్స్ క్లాస్ చెబుతుండగా.. దుండగుడు హఠాత్తుగా తరగతి గదిలోకి ప్రవేశించాడు. అందరూ చూస్తుండగానే బాలికపై రంపం యంత్రంతో దాడి చేశాడు. ఈ ఘటనతో అక్కడున్న వారంతా నిర్ఘాంతపోయారు. తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.




## విద్యార్థులకు 21 రకాల సదుపాయాలు అందించాలి


**ఐటీడీఏ పీవో. లెనిన్ వత్సల్..**

**ఏటూరు నాగారం. అక్టోబర్ 31**
**( సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి )**

విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న 21 రకాల సదుపాయాలు ప్రతి ఒక్కరికి 100% చేరాలని ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా బాలసముద్రం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి యూనిఫామ్. షూస్. బ్యాగులు. తదితర వస్తువుల పంపిణీ పై ఆరా తీశారు. అనంతరం వంటశాల. స్టోర్ రూమ్ సైన్స్ కంప్యూటర్ ల్యాబ్ లను పరిశీలించారు..

## ప్రతి పౌరుడిపై జాతీయ సమైక్యతను కాపాడే బాధ్యత ఉంది

భారతదేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రత పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో భారత ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధానమంత్రి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశాన్ని ఐక్యంగా, బలంగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నాయకత్వం, దూరదృష్టి, దేశభక్తి చిరస్మరణీయమన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలు, స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత కోసం చేపట్టిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.పటేల్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని, దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రజల మధ్య సోదరభావం, సామరస్యం, ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు.



# రెండు భాగాలుగా విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన'..

## తొలిసారి విజయ్‌తో కీర్తి సురేష్ జోడీ

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'రణబాలి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన.. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన' అనే మాస్ రూరల్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. 'రాజా వారు రాణి గారు' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రవికిరణ్ కోలా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో మంచి అంచనాలు ఏర్పడగా.. తాజాగా సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'రౌడీ జనార్ధన' సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం మొదలైంది. కథా పరిధి, సినిమాలోని అంశాల నేపథ్యంలో రెండు భాగాలుగా తీసుకొస్తే బాగుంటుందనే అభిప్రాయంతో చిత్ర బృందం ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అయితే ఈ వార్తలపై నిర్మాతలు లేదా దర్శకుడు ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవల టాలీవుడ్‌లో రెండు భాగాలుగా సినిమాలను విడుదల చేసే విధానం పెరిగింది. కథకు విస్తృతమైన పరిధి ఉన్నప్పుడు, పాత్రలు మరియు కథాంశాలను మరింత వివరంగా చూపించడానికి దర్శకులు ఈ పద్ధతిని ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ సినిమా కూడా రెండు భాగాలుగా వస్తుందనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ జోడీపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కీర్తి సురేష్‌కు కథలో ఎలాంటి పాత్ర ఇచ్చారు? విజయ్‌తో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉండబోతోంది? అనే విషయాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. 'రౌడీ జనార్ధన'ను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. క్రిస్టో జేవియర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ కథగా ఈ సినిమా రూపొందుతోంది. విజయ్ దేవరకొండ మాస్ ఇమేజ్‌కు తగిన కథ, రవికిరణ్ కోలా దర్శకత్వం, కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించడం ఈ ప్రాజెక్టుపై అంచనాలను పెంచుతున్నాయి.



# గోల్డెన్ గ్లామర్‌లో జాన్వీ కపూర్..

## కుర్రాళ్లను కట్టిపడేస్తున్న ఫొటోలు




# 'ఛావా' దర్శకుడి కొత్త సినిమా..

## శ్రద్ధా కపూర్ 'ఈతా' ట్రైలర్ విడుదల!

బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'ఛావా' చిత్రానికి దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఈతా' ప్రముఖ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మహారాష్ట్ర సాంస్కృతిక జానపద కళాకారిణి, లావణీ లెజెండ్ విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ బయోపిక్ రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ విఠాబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి కనిపించనున్నారు. ఆమె కెరీర్‌లో ఇదొక మైలురాయిగా నిలిచే పాత్ర అని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లావణీ నృత్య రూపం మరియు ఒక సాధారణ మహిళా కళాకారిణి అసాధారణ విజయాలు సాధించే ప్రయాణాన్ని ట్రైలర్‌లో అత్యద్భుతంగా హైలైట్ చేశారు. ప్రముఖ నిర్మాత దినేష్ విజాన్ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ రణ్‌దీప్ హూడా కూడా ఒక కీలకమైన పాత్రలో నటిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.